# గౌతమీగాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

## అసలు కథ

**1980** జనవరి 30 తేదీ ఉదయం భద్రాచలం బస్సు పాల్వంచ దగ్గర ఆగింది.

పాల్వంచ అనగానే ఏదో జ్ఞాపకం చట్టున పొడిచింది.

ముందు సీట్లో కూచున్న ఆయన్ను కదిపి "అయ్యా, ఇక్కడెక్కడో కిన్నెర వాగు వుందట -" అన్నాను.

ఆయన నన్ను ఎగాదిగా చూసి నవ్వి-" వుండండి - చూద్దురుగాని.... రెండుమూడు ఫర్లాంగుల్లో వస్తుంది" అన్నాడు. పదినిమిషాల్లో బస్సు వంతెన మీదకు వచ్చింది. కింద ఒక వాగు. మెలికలుతిరిగి ఒయ్యారంగా ప్రవహిస్తోంది. మామూలు సెలయేరు.

కోనసీమలో కౌశికిలా ఉంది.

ఇదే కిన్నెరసాని అన్నాడు.

ఒళ్ళు జల్లు మంది

1960 జనవరి 30 తేదీన ఆగ్రాలో తాజ్ మహల్‌ను చూచినప్పుడు కూడా అంత "థ్రిల్" అనుభవించలేదు.

ముఖమంతా కళ్ళుచేసుకు చూశాను.

ఏనాటి కోరిక;

"ఓహో కిన్నెరసానీ; ఓహో కిన్నెరసానీ!
ఊహామాత్రము లోపల ఏల నిలువవే! జవరాలా!"

అప్రయత్నంగా గొంతులో పాట కదిలింది.

"అచట కిన్నెరసాని - నా యాత్మయందు
ఇప్పటికి దాని సంగీతమే నడించు"

అన్నాడు పాపం, ఆ నాటి విశ్వనాథ- ఎంత కదిలిపోయి పాడాడో ఊరూపేరూ లేని ఆ చిరువాగుకు అమరత్వం ప్రసాదించి పోయాడు.

"తెలుగు సత్కవిరాజు వలె కందుకోలేని
చవులూరి చవులూరి సాగిం" దట కిన్నెర-
"తెలుగు దైవమ్ము భద్రాద్రిపై నెలకొన్న
రామయ్య-అతని దర్శనము చేసే త్రోవ
కాచింది కిన్నెర"- భేష్. ఆ రామయ్య దర్శనానికి ముందు ఈ కిన్నెర చూపు ఎంత హృద్యంగా ఉంది!

బస్సు ఆగింది. భద్రాద్రిలో ప్రవేశించి సరాసరి గోదావరికి వెళ్ళాను.

అమ్మ గౌతమిని రాజమహేంద్రవరం దగ్గర ఎంతో నిండుగా అఖండంగా చూడడం అలవాటు! ఇక్కడ ఇంత కృశించి ఉందేమిటి?

"వేణీభూత ప్రతను సలిల" నివ్వెరపోయాను.

తనివితీర అమ్మను కౌగలించుకున్నాను. కడుపార పయస్సులు త్రాగాను. దేశంలో ఎన్ని నదులు లేవు? ఏమిటీ హృదయ బంధం?

రామదాసధ్యానమందిరం ప్రాంగణంలో నిలబడి ఎక్కడో పడమటికనుమల్లో పుట్టి తూర్పుగా ప్రశాంత గంభీరంగా సాగిపోయే గోదావరీ ప్రవాహంవైపు రెప్ప వాల్చకుండా చూస్తున్నాను.

"భగతి గోదావరి నమస్తే"

ఆతల్లిని తలుచుకుని నాకన్న వెర్రిగా పులకించిపోయే మా అన్న భవభూతి జ్ఞాపకం వచ్చాడు.

ఎక్కడో దక్షిణప్రాంత సరస్సీరంలో జరిగిన శంబూక వృత్తాంతం పంచవటీ తీరానికి తెచ్చాడు. మనసు పటలేక-

"ఏతే తే కుహరేషు గద్గద నదద్ గోదావరీ వారయః ." అని నోరారా అంటే గాని ఆయనకు తోచదు.

"మూడుకన్నుల కొండమీదా తోడు నీడా లేక పుటీ కూడకొన్నది కొ తవారిని జోడుగా విడిచింది తోయం బేయరా - తెడ్డేయరా" - అంటాడు చిలుకూరి నారాయణరావుగారు; ఒకసారి రాజమండ్రిలో విద్యార్థులతో బోటుషికారుకు వెళ్ళి కెరటాలమీద తేలుతూ తెడ్లు వేయించి పాడాడట, ఆ పుణ్య పురుషుడు!

ఆ తల్లి మూడుకన్నుల కొండమీద పుట్టినా – బుద్ధి వక్రించి అటు అరేబియా సముద్రంలోకి జారితే – ఇంకేముంది? మనకు మిగిలేవి రాళ్ళూ రప్పలూ. చోళ్ళూ, జొన్నలూ – తెలుగు వాళ్ళ సుకృతం దొడ్డది.

ఏళ్ళతరబడి దప్పి తీరింది; నట్టింట బంగారం పండింది!

"స్వామి, మీరు రాముణ్ణి చూడ్డానికి వచ్చారా? గోదావరినా?" అని యెవరో చెవిలో గిపెట్టి నట్టయింది.

నవ్వి అన్నాను. "ముందు అమ్మను, తర్వాత అయ్యను."

గోదావరిని చూస్తే తలనిండా – పిలిస్తే పలికే యెన్ని జ్ఞాపకాలు!

విశాఖ మండలంలో పుట్టి ప్రయాణ వశాత్తు రాజమండ్రిలో రైలుదిగి, పది పన్నెండేళ్ళ కుర్రాడు రహదారీపడవఎక్కడానికి గోదావరి ఒడ్డుకు వచ్చాడు.

విశాలంగా పరుచుకున్న అంత వినీల జలపటాన్ని ఎప్పుడూ చూసి ఎరగడు. కళ్ళింత చేసుకు చూస్తున్నాడు.

పడవకడుపును సామాన్లతో నింపారు. తెరచాప ఎత్తారు. "హైలెస్స" అంటూ సరంగులు గోదావరి యాసతో పడవను లోతుకు తోస్తున్నారు. ఎవరో తొందర చేస్తే పడవెక్కి పడిచెక్కమీద కూచున్నాడు.

చల్లని నదీహృదయంమీద పడవ కదులుతోంది. "దాని అడుగున నా పూర్వ పురుషుల ఎన్ని అస్థిత్వాలు దాగి ఉన్నాయో" అనుకున్నాడు.

ఏ కొండ ఇడుకునో. బండ మెలికలోనో పుట్టిన కిన్నెర గోదావరిఒడిలో పడి ఊరట పొంది వన్నె కెక్కింది.

ఏ తలంపూ లేకుండా తన అంకతలానికి చేరిన- ఆ పిల్లవాణ్ణి గౌతమీమాతృమూర్తి ఆ క్షణంనుంచీ తనవాణ్ణి చేసుకుంది. బతుకు పండించింది. మనిషిని చేసింది.

కాలవలపక్క పల్లెటూళ్ళు: ఊళ్ళ పక్క పచ్చపొలాలు. పళ్ళ బరువుకు వంగిన కొబ్బరి, పోకతోట, చెట్ల మొదట జరిగే కావ్యశాస్త్రపాఠాలు! ఉదయం పొగమంచులో కాలవస్నానంచేసి తడిఅంగవస్త్రాల మడతలతో ఎదురుపడే బ్రాహ్మణ గృహస్థులు. సాయంకాలాల్లో పచ్చని వెలుగులో సంధ్యావార్చే విద్యార్థివటువులు. కళ్ళనిండా కాటుకతో కలకలలాడే ముఖాలతో శ్రావణపేళల పట్టుచీరలతో ఎదురయ్యే పుణ్య గేహినులు. సంజవేళల బుజంమీద బరువులతో బల్లకట్టు దాటే రైతుజనం.

అరచేత ప్రాణాలుపెట్టుకుని గాలీవానా లో చేసిన నావప్రయాణాలు, గురువుగారి కుటుంబంతో కలిసిపోయి బంధువులిళ్ళకువెళ్ళిన పెళ్ళిపందిళ్ళ సందడులు.

పల్లెపట్టే మా విశ్వ విద్యాలయం. అరుగులే మా పరీక్షా కేంద్రాలు. అరకొర చదువులు పనికిరావు.

నూటికి నూరూ ఆ చదువుల పరమ లక్ష్యం!

గోదావరి యిసకతిన్నెలమీద ఆడుకుంటూ సుదూరనీలిమలో వూహించుకునే పాపికొండల భయాలు! భద్రాద్రి సీతారాములు

గట్టెక్కిన తర్వాత—

కడచిన స్నేహాల వియోగాల సలపరింపులు—

సభలు, సాహిత్యాలు, వియ్యాల్లో కయ్యాలూ—

కయ్యాల్లో వియ్యాలు!

రక్తంలో ప్రతి అణువూ ఒక కథ చెబుతుంది.

ఏదీ, ఒకటి చెప్పమంటావా?

ఉహుం. ఆ జ్ఞాపకాల బరువుతో ఇప్పుడు మాటాడలేను.

ఒక్కొకసారి, ఒకొక్కటి- చెబుతాను●


